ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
సోమవారం 31 మార్చి 2025



వైభవంగా ఉగాది

జిల్లా వ్యాప్తంగా పంచాంగ శ్రవణాలు

జగిత్యాల అర్బన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. జగిత్యాల పట్టణంలోని ఆలయాలు వేలాదిగా తరలివచ్చిన భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా ఆయా ఆలయాల్లో నిర్వాహకులు భక్తులకు ఉగాది పచ్చడి అందజేశారు.



జగిత్యాలలో పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

● పట్టణంలోని మార్కండేయ స్వామి ఆలయంలో తిగుళ్ల విషు శర్మ పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు బోగ గంగాధర్ పాల్గొన్నారు.

● నంబినరసింహస్వామి పంచాంగ శ్రవణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సుధాకర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మోహన్ పాల్గొన్నారు.

● పట్టణంలోని 1వ వార్డులో వివేకానంద విద్యానగర్ కమిటీ ఆధ్వర్యంలో శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పంచాంగ శ్రవణం లక్ష్మీనర్సయ్య సమక్షంలో జరిగింది. కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని పద్మనాయక కల్యాణ మండపంలోని వెలమ సంక్షేమ మండలి ఆధ్వర్యంలో నిర్వహించిన పంచాంగ శ్రవణంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వెలమ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అయిల్నేని సాగర్‌రావు పాల్గొన్నారు. పట్టణంలోని ధరూర్ క్యాంప్, ఎస్‌కేఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే సంజయ్ కుమార్ పాల్గొన్నారు.



ధర్మపురిలో వేద పండితుడిని సత్కరిస్తున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్

జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో జరిగిన పంచాంగ శ్రవణం కార్యక్రమంలో పట్టణంలోని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త పండిత నంబి వేణుగోపాలాచార్య కౌశిక ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● పండితులకు సన్మానం

ధర్మపురి: ధర్మపురి క్షేత్రంలోని శేషప్ప కళా వేదికపై ఆరుగురు పండిత, కళాకారులను ఆలయం పక్షాన ఘనంగా సత్కరించారు. ఆలయం పక్షాన ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ శేష వస్త్రం కప్పి, నగదు అందజేసి ఘనంగా సత్కరించారు.

ఈత సరదా.. కారాదు విషాదం 6
వేసవిలో చెరువులు, కాలువల వద్ద పొంచి ఉన్న ప్రమాదాలు
పిల్లలను జాగ్రత్తగా గమనించాలని నిపుణుల సూచన

రైతు వేదికల్లో సమస్యల తిష్ఠ 8
నిర్వహణ ఖర్చులు రెండేళ్లుగా విడుదల కాని వైనం

వేంకటేశ్వర స్వామి ఊరేగింపు

రాయికల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని ఇటిక్యాల గ్రామంలో ఆదివారం ఉగాది పర్వదినం సందర్భంగా శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామి వారి ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పుర వీధుల గుండా ఊరేగింపు నిర్వహించగా మహిళలు, భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడికి సన్మానం

కోరుట్ల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల పట్టణంలోని జువ్వాడి భవనంలో శనివారం కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు నాయిని సురేష్‌ను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ఆధ్వర్యంలో నాయకులు సన్మానించారు. సేవాదళ్ అధ్యక్షుడిగా ఎంపికైన సురేష్ మొదటి సారిగా కోరుట్ల పట్టణానికి రాగా ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ తన నియమాకానికి సహకారం అందించిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు, నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తిరుమల గంగాధర్, కొంతం రాజం నాయకులు పాల్గొన్నారు.

రుణ ప్రణాళిక ఖరారు



- జిల్లాకు రూ.6,615 కోట్ల నిధులు కేటాయింపు
- అత్యధికంగా పంట యాజమాన్యం, మార్కెటింగ్‌కు..
- సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల రంగానికి రూ.996 కోట్లు

జగిత్యాల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా వార్షిక రుణ ప్రణాళిక ఖరారైంది. ప్రతీ సంవత్సరం బ్యాంకుల ద్వారా రైతులు, ఇతర వర్గాల వారికి అందించేందుకు గాను నాబార్డు రుణ లక్ష్యాన్ని ఖరారు చేస్తుంది. దీన్ని బట్టి జిల్లాలోని వివిధ బ్యాంకులకు నిర్దేశించి రుణాలను అందిస్తుంటారు. జిల్లా వ్యాప్తంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ రూ.6,615 కోట్ల రుణాలను ఇవ్వాలని నాబార్డు ప్రకటించింది. దీనికి సంబంధించి కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశంలో బ్యాంకుల వారీగా నిర్దేశించారు.

జిల్లాలో తగ్గిన రుణ లక్ష్యం

జిల్లా వ్యాప్తంగా వివిధ రంగాల్లో 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.6,615 కోట్లు రుణాలను అందించాలన్న లక్ష్యంతో అధికారులు ఉన్నారు. ఇందులో వివిధ విభాగాలకు అందించే లక్ష్యాన్ని నాబార్డు నిర్దేశించింది. వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలైన ఫుడ్ ప్రాసెసింగ్, ఇతర వ్యవసాయ అనుబంధ రుణాల కోసం లక్ష్యాన్ని నిర్దేశించారు. గత యేడాది కంటే ప్రస్తుతం రూ.732 కోట్లు తక్కువగా రుణ లక్ష్యాన్ని నాబార్డు నిర్దేశించింది. ఈ రుణాల్లో కొత్త వాటితో పాటు రెన్యూవల్ రుణాలు కూడా ఉంటాయి. 2024-25 ఆర్థిక సంవత్సంరలో 7,347 కోట్లు రుణ లక్ష్యంగా ఉండగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ. 6,615 కోట్లు రుణ లక్ష్యంగా నిర్ణయించారు. జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్‌ఎంఈ) రంగానికి ఈ యేడాది రూ.996 కోట్లు రుణాలను ఇవ్వాలని నిర్ణ యించారు. జిల్లాలో చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించేందుకు ఈ రుణాలను అంది స్తారు. గత యేడాది కంటే తక్కువగా ఎంఎస్‌ఎంఈ రుణాల కోసం సుమారు వంద కోట్లు తగ్గించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ రుణాలతో పాటు స్వయం సహాయక సంఘాల సభ్యులకు గ్రామీణ జీవనోపాధి పథకం కింద అందించే రుణాలు ఈ విభాగంలోకి వస్తాయి.



2025-26 ఆర్థిక సంవత్సరం ప్రణాళిక

2025-26 వార్షిక సంవత్సరానికి సంబంధించి వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలకు అత్యధికంగా రుణాలను ఇవ్వాలని నాబార్డు నిర్ణయించింది. ఇందులో పంట యాజమాన్యం, మార్కెటింగ్ రుణాల కోసం రూ.2,654.66 కోట్లు, నీటి వనరుల కల్పనకు రూ.78.77 కోట్లు, యాంత్రీకరణకు రూ.241.31 కోట్లు, ఉద్యాన శాఖకు రూ.143.31 కోట్లు, పాడి పరిశ్రమకు రూ.290.01 కోట్లు, కోళ్ల పెంపకానికి రూ.150.13 కోట్లు, జీవాలు, పందుల పెంపకానికి రూ.42.81 కోట్లు, చేపల పెంపకానికి రూ.48.20 కోట్లు, గోదాములు, కోల్డ్ స్టోరేజీలకు రూ.171.92 కోట్లు, భూముల అభివృద్ధికి రూ.19.20 కోట్లు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు రూ.75.22 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించారు. వ్యవసాయ అభివృద్ధి, గోదాములు, కోల్డ్ స్టోరేజీ నిర్మాణం, విత్తనోత్పత్తి ప్లాంట్ల నిర్మాణాల కోసం ఈ యేడాది అధిక మొత్తంలో రుణాలను ఇవ్వాలని నిర్ణయించారు. ఇతర ప్రాధాన్యత రంగాల కింద విద్యకు రూ.40.62 కోట్లు, గృహాలకు రూ.144.77 కోట్లు, పునరుద్ధరణీయ శక్తి, సామాజిక సదుపాయాల కల్పన కింద రూ. 52.81 కోట్లు, సంప్రదాయేతర ఇంధన వనరులకు రూ.33.08 కోట్లు రుణాలను అందిస్తారు. ఇతర వాటి కోసం రూ. 94.84 కోట్లు రుణాలను ఇవ్వాలని నాబార్డు నిర్ణయించింది.

పకడ్బందీగా రుణాల పంపిణీకి చర్యలు
బీఎస్ లత, అదనపు కలెక్టర్



జిల్లా వ్యాప్తంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ నిర్దేశించిన వార్షిక రుణ ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. రుణాలను అందించడంలో నిర్లక్ష్యం చేయవద్దని బ్యాంకర్లను ఆదేశించాం.

బ్యాంకుల వారీగా లక్ష్యాన్ని నిర్దేశించాం
రాము కుమార్, జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్



జిల్లాలో బ్యాంకుల వారీగా రుణ లక్ష్యాన్ని నిర్దేశించాము. సంబంధిత బ్యాంకులకు కేటాయించిన రుణ లక్ష్యాన్ని సాధించేలా అవసరమైన జాగ్రత్తలు తీసుకుంటున్నాం. ఇప్పటికే బ్యాంకర్లతో సమావేశం ఏర్పాటు చేసి దిశా నిర్దేశం చేశాం. నాబార్డు నిర్ణయించిన లక్ష్యం మేరకు బ్యాంకులు రుణాలు ఇవ్వాల్సి ఉంటుంది.

నేడు రంజాన్

- ప్రార్థనలకు సిద్ధమైన ముస్లింలు
- ఈద్గాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు

జగిత్యాల అర్బన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉపవాస దీక్షలు, జకాత్, ఫిత్రా వంటి దానధర్మాలకు ప్రతీకగా భావించే ఈదుల్ ఫితర్ (రంజాన్)ను సోమవారం ముస్లింలు జరుపుకోనున్నారు. ఆదివారం రాత్రి నమాజు అనంతరం నెలవంక దర్శనమిచ్చింది. నెల రోజుల దీక్ష ముగించి సోమవారం సామూహిక నమాజ్ అనంతరం ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటారు. మాసమంతా ఖురాన్ పఠనంతో పాటు ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లింలు చిన్నా పెద్దా తేడా లేకుండా అల్లాహ్‌పై తమ భక్తి ప్రపత్తులు చాటుకున్నారు.

మార్కెట్‌లో సందడి

రంజాన్ వస్తువుల కొనుగోళ్లతో రెండు, మూడు రోజుల నుంచి మార్కెట్ సందడిగా మారింది. ముస్లింలు షాపింగ్ చేస్తూ బిజీగా గడుపుతున్నారు. వస్త్ర, వ్యాపార సముదాయాలు రద్దీగా మారాయి. దుస్తులు, టోపీలు, అత్తర్లు, స్ప్రేలు, స్వీట్లు, సేమియాలు, గాజు లు, సుర్మా, మెహందీ, అలంకరణ సామగ్రి కొనుగోలు చేశారు.

ఈద్గాల్లో ఏర్పాట్లు

రంజాన్ సందర్భంగా పలు ఈద్గాల్లో ఏర్పాట్లు పూర్తయ్యాయి. సోమవారం ఉదయం సామూహిక ప్రార్థల దృష్ట్యా మున్సిపల్, పోలీసు, విద్యుత్, రెవెన్యూ తదితర శాఖల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. షామియానాలు, టెంట్లు, కార్పెట్లు, తాగునీటి సౌకర్యం కల్పించారు.

రంజాన్ ఏర్పాట్ల పరిశీలన



ఈద్గా వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ మారుతి

కోరుట్ల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతంలోని ఈద్గాను శనివారం మున్సిపల్ కమిషనర్ మారుతి ప్రసాద్ పరిశీలించారు. ఈద్గాలో రంజాన్ పర్వదినం పురస్కరించుకొని ఆదివారం నిర్వహించే ప్రార్థనల కోసం ఏర్పాట్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేస్తా
కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్



మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ సహాయమంత్రి సంజయ్‌కుమార్

కొడిమ్యాల, మార్చి30(ఆంధ్రజ్యోతి) : కొడిమ్యాల మండలంలో అభివృద్ధి పనులకు నిధులను మంజూరు చేస్తానని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్ హామీ ఇచ్చారు. శనివారం రాత్రి మండల కేంద్రంలోని ఐక్య సంఘం, కుమ్మరి సంఘం నాయకులు, సభ్యులు ఐఖ్య సంఘ భవనానికి, కుమ్మరి సంఘ భవనానికి నిధులు మంజూరు చేయాలని కరీంనగర్‌లో మంత్రికి వినతి పత్రం అందించారు. సానుకూలంగా స్పందించిన మంత్రి సంఘ భవనాల అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు గ్రామ నాయకులు తెలిపారు. వినతి పత్రం అందించిన వారిలో ఐక్య సంఘం అధ్యక్షుడు అంకం రాజేశం, ఐక్య సభ్యులు, కుమ్మరి సంఘం నాయకులు, సభ్యులు, బీజేపీ నాయకుడు తిరుపతిరెడ్డి, బోగ రాకేష్ ఉన్నారు.

పద్మనాయక యువజన సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రావు

రాయికల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అల్లీపూర్ పద్మనాయక యువజన సంఘం అధ్యక్షుడిగా బొజ్జ శ్రీనివాస్ రావు ఎన్నికయ్యాడు. ఆదివారం జరిగిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కొండపల్కుల రాజు రావు, ఉపాధ్యక్షులుగా కట్ట రవీందర్ రావు, సంయుక్త కార్యదర్శిగా మిట్టపల్లి అజిత్ రావు, కోశాధికారిగా ద్యావనపెల్లి వేణు రావు, ప్రచార కార్యదర్శిగా పునుగోటి గంగారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

రాయికల్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుమ్మరిపెల్లి గ్రామానికి చెందిన సిరిపురం మల్లేశం అనే ఉపాధ్యాయుడు లెక్చరర్‌గా ఎంపిక కాగా గ్రామ పద్మశాలి సేవా సంఘం సభ్యులు ఆదివారం ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పారిపెల్లి నారాయణ, మాజీ ఎంపీటీసీ ఉడుత రవీందర్, గాజెంగి రాజేశం, మాజీ సర్పంచ్ నందయ్య, సామల్ల బుచ్చన్న పాల్గొన్నారు.

జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారిగా వేణుగోపాల్‌రావు



జగిత్యాల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారిగా వేణుగోపాల్ రావు నియామకం అయ్యారు. జగిత్యాల జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారిగా పనిచేస్తున్న మనోహర్ ఈనెల 31వ తేదీతో పదవీ విరమణ పొందుతుండడంతో పెద్దపల్లిలో పనిచేస్తున్న వేణుగోపాల్ రావును జగిత్యాలలో నియమిస్తూ పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ గోపి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారిగా పనిచేసి వెళ్లి తిరిగి మరోమారు నియామకమైన వేణుగోపాల్ రావును వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్ కందుకూరి పూర్ణచందర్, పోరుమల్ల వెటర్నరీ అసిస్టెంట్ గరిగంటి రవి, ఎలిగేటి రవీందర్ తదితరులు అభినందించారు.

లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

మల్లాపూర్, మార్చి30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండంపల్లి గ్రామంలోని శ్రీలక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలోని గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉగాది పర్వదినం సందర్భంగా ఆలయంలోని స్వామి వారికి పురోహితులు అభిషేకాలు, అర్చనలు, హారతి తదితర కార్యక్రమాలనంతరం పంచాంగ శ్రవణం వంటి కార్యక్రమాలను వైభవంగా జరిపారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్ని ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 1న స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించడం జరుగుతుందని గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. స్వామి వారి కల్యాణంలో భక్తులు పాల్గొని స్వామి దర్శించుకోవాలన్నారు.

రామలింగేశ్వర స్వామి జాతర

గొల్లపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చిల్వాకోడూర్ శ్రీ రామలింగేశ్వర స్వామి జాతర ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. జాతర ఉత్సవాల్లో భాగంగా నాలుగవ రోజు నూతన సంవత్సర పంచాంగ శ్రవణం, స్వామి వారి పల్లకి సేవ కార్యక్రమాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారులు భక్తులకు ఆశీర్వచనాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ దాసరి తిరుపతి గౌడ్, వైస్ చైర్మన్ సింగారపు కొమురయ్య, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి జాతర

● ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



పూజలు నిర్వహిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెగ్గెర్లలో శ్రీలక్ష్మీనరసింహస్వామి జాతర మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి భక్తులు స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అర్చకులు హోమం నిర్వహించి అర్చనలు, అభిషేకాలు చేశారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. సిరికొండలో గ్రామ శివారులో కొలువైన మల్లన్నస్వామి జాతర మహోత్సవం వైభవంగా జరిగింది. అదేవిధంగా తుర్తిలో ఆంజనేయస్వామి జాతర ఘనంగా జరగగా భక్తులు టెంకాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. ఈ జాతరల్లో వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొనగా అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. స్థానిక ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమాల్లో మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, ఎన్‌ఆర్‌ఐ బైర్ దేవ్, గోపిడి ధనుంజయ్‌రెడ్డి, కారపు గంగాధర్, మట్కం భూమయ్య, మల్లేశ్, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

బీర్‌పూర్, మార్చి 30(ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండల కేంద్రానికి చెందిన యువ చైతన్య యూత్ అధ్యక్షులు కాలువ హరీష్ తండ్రి బుచ్చన్న ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలుసు కున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆదివారం బుచ్చన్న కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాడ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట సారంగాపూర్ మాజీ సర్పంచ్ గుర్రాల రాజేందర్ రెడ్డి, బీర్‌పూర్ మాజీ సర్పంచ్ హరీష్, శ్రీనివాస్, రాజేందర్ ఉన్నారు.

యాదవ సంఘాలను బలోపేతం చేయాలి



సభ్యత్వ రసీదులు అందిస్తున్న నాయకులు

కథలాపూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): యాదవుల హక్కుల కోసం పోరాటం చేస్తూ సంఘాలను బలోపేతం చేయడానికి కృషి చేయాలని జిల్లా యాదవ సంఘం అడహక్ కమిటీ సభ్యుడు రామాంజనేయులు సూచించారు. ఆదివారం మండలంలోని బొమ్మెనలో సభ్యత్వ నమోదులో భాగంగా సంఘ సభ్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. యాదవులకు ప్రభుత్వం నుంచి రావాల్సిన పథకాలను పొందడానికి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. 40మంది సభ్యులకు సభ్యత్వం అందజేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు రాచర్ల రవి, అంకం శంకర్, లక్కం మహిపాల్, మండల ఇన్‌ఛార్జి మధుయాదవ్ పాల్గొన్నారు.

ఆటో-ద్విచక్రవాహనం ఢీ

● యువకుడు మృతి

పెద్దపల్లి రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హన్మంతునిపేట గ్రామశివారులో శనివారం సాయంత్రం ఆటో, ద్విచక్రవాహనం ఢీకొనడంతో యువకుడు మృతిచెందాడు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపినవివరాల ప్రకారం.. హన్మంతునిపేట గ్రామానికిచెందిన అజయ్ (23) అనే యువకుడు ద్విచక్ర వాహనంపై పెద్దపల్లికి వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొట్టడంతో తీవ్రగాయాల పాలయ్యాడు. క్షతగాత్రుడిని పెద్దపల్లి ఆసుపత్రికి తరలించగా రాత్రి మృతిచెందినట్లు తెలిపారు. మృతుడి తల్లి స్వరూప ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లక్ష్మణ్‌రావు తెలిపారు. గ్రామంలో చిరుతల రామాయణంలో చురుకుగా పాల్గొని తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో విషాదం నెలకొంది.

గల్లంతైన చిన్నారి మృతదేహం లభ్యం

రామగిరి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్వచర్ల శివారులోని ఇటుక బట్టీలో ఒడిశారాష్ట్రానికి చెందిన గెల్హి(2) అనే చిన్నారి మృతదేహం ఆదివారం లభ్యమైంది. శనివారం సాయంత్రం ఎస్ఆర్ఎస్పి, ఎల్ఎస్‌బి కెనాల్‌లో ప్రమాదవశాత్తు పడి గల్లంతైంది. కెనాల్‌లో నీటి సరఫరాను నిలిపివేసి శనివారం నుంచి గాలింపులు చేపట్టగా ఆదివారం ప్రమాదానికి నీట మునిగిన ప్రాంతం నుంచి 7వందల మీటర్ల దూరంలో చిన్నారి మృతదేహం నీటిపై తేలిందని ఎస్ఐ చంద్రకుమార్ తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు చిన్నారి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

ఓదెల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో ఆదివారం బుద్దె కుమార స్వామి అనే రైతుకు చెందిన ఎద్దు ప్రమాదవశాత్తు విద్యుదాఘాతంతో మృతిచెందింది. సాయంత్రం మొక్కజొన్నపంట సమీపంలో గడ్డి మేస్తున్న సమయంలో కిందికు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ కేబుల్ ఎద్దుకు తాకడంతో షాక్‌తో అక్కడికక్కడే మృతిచెందింది. ఎద్దు మృతితో రూ.50వేల మేరకు ఆర్థికనష్టం వాటిల్లిందని రైతు కుమారస్వామి తెలిపారు. ప్రమాదప్రాంతానికి విద్యుత్ అధికారులు సందర్శించి పరిశీలించారు.

అభ్యంతరకర పోస్టులు పెట్టిన వ్యక్తిపై కేసు నమోదు

తంగళ్లపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండలంలోని పలు వాట్సాప్ గ్రూపుల్లో అభ్యంతరకర పోస్టులు పెట్టిన రామచంద్రపూర్ గ్రామానికి చెందిన బొడ్డు శ్రీధర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. తనను కించపరిచేవిధంగా బొడ్డుశ్రీధర్ పోస్టులు పెట్టాడని చిన్న లింగపూర్ గ్రామానికి చెందిన బైరినేని రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. దర్యాప్తులో భాగంగా ఆదివారం నిందితునివద్ద నుంచి మొబైల్‌ఫోన్ స్వాధీన పర్చుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే విధంగా, వైషమ్యాలు రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియాలో ఎవరైనా పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఏఎంసీ కార్యదర్శి, సెక్యూరిటీగార్డుల రిమాండ్

కరీంనగర్ క్రైం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): కరీంనగర్‌లో పండ్ల వ్యాపారుల నుంచి 60వేల రూపాయలు లంచం తీసుకుంటూ శనివారం ఏసీబీకి చిక్కిన కరీంనగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎ పురుషోత్తం, సెక్యూరిటీగార్డు శ్రీనివాస్ రెడ్డిని రిమాండ్‌కు తరలించారు. శనివారం ఇదరిని అదుపులోకి తీసుకున్న కరీంనగర్ ఏసీబీ పోలీసులు విచారణ అనంతరం ఆదివారం కోర్టులో హాజరుపరిచారు. జడ్జి ఆదేశాలతో కరీంనగర్ జిల్లా జైలుకు 14 రోజుల రిమాండ్‌కు తరలించారు. కేసు దర్యాప్తు కొనసాగుతుందని ఏసీబీ డీఎస్పీ వీవీ రమణమూర్తి తెలిపారు.

ఈత సరదా.. కారాదు విషాదం..

- వేసవిలో చెరువులు, కాలువల వద్ద పొంచి ఉన్న ప్రమాదాలు
- పిల్లలను జాగ్రత్తగా గమనించాలని నిపుణుల సూచన



జగిత్యాల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ఈలకొలనుల్లో, చెరువులు, కుంటల్లో ఈత కొట్టడం చాలా మంది పిల్లలకు సరదాగా ఉంటుంది. కానీ తగు జాగ్రత్తలు పాటించకపోతే ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. జగిత్యాల జిల్లాలో ప్రధానంగా ఎస్సారెస్పీ కాకతీయ కాలువ, వరద కాలువ అనుబంధ కాలువల్లో పిల్లలు ఈత కొడుతుంటారు. అజాగ్రత్తగా వ్యవహరిస్తే ఈతకు వెళ్లిన వారు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు సైతం ఉన్నాయి.



● జిల్లాలో ఇటీవల జరిగిన సంఘటన

గొల్లపల్లి మండలం రంగదామునిపల్లె రిజర్వాయర్‌లో కొద్ది రోజుల క్రితం ఈతకు వెళ్లి ఎనిమిదో తరగతి బాలుడు నేరెళ్ల నరేష్(12) మృతిచెందాడు. ఒంటిపూట బడి అయిపోగానే తోటి మిత్రులతో కలిసి రిజర్వాయర్‌లోకి ఈత నేర్చుకునేందుకు వెళ్లాడు. మిత్రులు చెరువు కట్ట మీద నుంచి ఒక చోట చెరువులోకి దిగి ఈత కొడుతుండగా నరేష్‌కు ఈత రాకపోవడంతో మరోచోట నుంచి రిజర్వాయర్‌లోకి దిగాడు. కాసేపటికి అందులో మునిగి మృతిచెందాడు.

● తల్లిదండ్రులూ..తస్మాత్ జాగ్రత్త

ఈత రాని పిల్లలను తల్లిదండ్రులు ఒంటరిగా పంపకూడదు. పిల్లలతో పాటు తల్లిదండ్రులు తప్పకుండా వెళ్లాలి. ఎంత లోతుకు వెళ్లి ఈత కొట్టాలో ముందే జాగ్రత్తగా చెప్పాలి. పిల్లలు చెరువులు, కుంటలు, కాలువలు, స్విమ్మింగ్‌పూల్స్‌లో ఈత కొడుతున్నంత సేపు పెద్దలు జాగ్రత్తగా గమనించాలి. ఈత నేర్చుకునేటప్పుడు లైఫ్ జాకెట్లు ధరించేలా చూడాలి. నిపుణల పర్యవేక్షణలో ఈతను నేర్పాలి. చెరువుల్లో చేపల కొరకు వేసిన వలలు ఉంటాయి. వాటిల్లో చిక్కుకునే అవకాశాలు ఉన్నందున అప్రమత్తంగా వ్యవహరించాలి. చెరువుల్లో బురద అధికంగా ఉన్న ప్రాంతాల్లో కాళ్లు పూడుకపోయి పైకి వచ్చే పరిస్థితి ఉండదు. కాలువల్లో నీటి ప్రవాహ వేగం అంచనా వేయకపోతే ప్రమాదాలు చోటుచేసుకుంటాయి.

● ప్రమాదాలు జరిగితే..

చెరువులు, కుంటలు, కాలువల్లో పడి చిక్కుకుపోయిన వారిని బయటకు తీయగానే వెల్లకిలా పడుకోబెట్టాలి. పొట్టపై మెల్లిగా నొక్కి నీటిని బయటకు తీయాలి. బాధితుడికి శ్వాస ఆడకపోతే తోటి వ్యక్తులు నోటి ద్వారా శ్వాస అందించాలి. గుండె కొట్టుకోకుంటే చాతిపై నొక్కాలి. వీలైనంత త్వరగా సమీప ఆసుపత్రికి తీసుకెళ్లాలి.

కుటుంబాన్ని బెదిరించిన వ్యక్తిపై కేసు

యైటింక్లయిన్‌కాలనీ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా ఇంట్లో చొరబడి ఓకుటుంబాన్ని బెదిరించిన కేసులో గుగు లోతు కుమార్‌నాయక్‌పై గోదావరిఖని టూటౌన్‌పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం శనివారం కుమార్ నాయక్ మరో పదిమందితో కలసి హనుమాన్‌నగర్‌కు చెందిన భాగ్యలక్ష్మి ఇంట్లో చొరబడి దాడికి యత్నిం చాడు. భాగ్యలక్ష్మి కుమారుడుకి వచ్చిన సింగరేణి టెండర్‌ను వదులు కోవాలని, లేదంటే కుటుంబం మొత్తాన్ని చంపుతానంటూ బెదిరించాడు.

భాగ్యలక్ష్మిపై దుర్భాషలాడుతూ దాడికి యత్నించాడు. కుమార్ నాయక్‌తో తన కుటుంబానికి ప్రాణహాని ఉన్నదని భాగ్యలక్ష్మి పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుమేరకు ఆదివారం గోదావరి ఖని టూటౌన్ పోలీసులు కుమార్ నాయక్‌పై కేసునమోదు చేశారు.

గ్రూపు-1లో మెరిసిన యువత



నక్క శృతిహర్షిత, కన్నం హరిణి, పాలకుర్తి సందీప్

సుభాష్‌నగర్/కరీంనగర్ టౌన్/కరీంనగర్ క్రైం, మార్చి 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం విడుదల చేసిన గ్రూపు-1 ఫలితాల్లో కరీంనగర్‌కు చెందిన యువతీ యువకులు మెరిసారు. జిల్లా కేంద్రానికి చెందిన నక్క శృతిహర్షిత జనరల్ విభాగంలో రాష్ట్రస్థాయిలో 14వ ర్యాంకు, మల్టీజోన్ స్థాయిలో 6వర్యాంకు సాధించారు. శృతిహర్షిత అలహాబాద్‌లోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఎన్ఐటీ) బీటెక్ పూర్తి చేశారు. సివిల్స్‌కోసం కూడా సిద్ధమవుతున్నారు. తండ్రి బాలయ్య వైద్యఆరోగ్యశాఖలో హెల్త్ ఎడ్యూకేటర్ ఆఫీసర్‌గా, తల్లి సరస్వతి కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. కలెక్టర్ కావాలనేది తన లక్ష్యమని, ప్రస్తుతం తనకు డిప్యూటీ కలెక్టర్ ఉద్యోగం వచ్చే అవకాశం ఉందని శృతిహర్షిత పేర్కొన్నారు.

కన్నం హరిణికి 55వ ర్యాంకు..

- ఎస్సీ కేటగిరీలో స్టేట్ ఫస్ట్

కరీంనగర్‌కు చెందిన కన్నం హరిణి 499.5 మార్కులతో జనరల్ కేటగిరీలో రాష్ట్రస్థాయిలో 55వ ర్యాంకు, ఎస్సీ కేటగిరీలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించారు. కరీంనగర్ ట్రినిటీ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్, ఎన్ఐటీ వరంగల్‌లో ఈఈఈలో చేరి బీటెక్ పూర్తి చేశారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉద్యోగంలో చేరారు. ఐఏఎస్ కావాలనే లక్ష్యం పెట్టుకున్న హరిణి రెండేళ్లు ఉద్యోగం చేసిన తర్వాత రాజీనామా చేసి ఆన్‌లైన్‌లో కోచింగ్ తీసుకుంటూ సివిల్స్‌కు సిద్ధమవుతున్నారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన గ్రూప్-1 పరీక్షకు హాజరయ్యారు. గ్రూప్-1 పరీక్ష రాసిన హరిణి రాష్ట్రస్థాయిలో జనరల్ కేటగిరిలో 55వ ర్యాంకు, ఎస్సీ కేటగిరిలో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించారు. గ్రూప్-1 ఉద్యోగంలో చేరినా ఐఏఎస్ లక్ష్యంగా సివిల్స్‌కు ప్రీపేర్ అవుతానని చెప్పారు. బోయినపల్లి మండలం అనంతపల్లికి చెందిన హరిణి తల్లిదండ్రులు కళాప్రపూర్ణ జ్యోతి, కన్నం రమేశ్ ఇద్దరూ స్కూల్ అసిస్టెంట్‌లుగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం కరీంనగర్‌లోని శ్రీరాంనగర్ కాలనీలో నివాసముంటున్నారు. హరిణికి ఒక అక్క, చెల్లె, తమ్ముడు ఉన్నారు. అక్క ఇప్పటికే డాక్టర్‌గా కొనసాగుతుండగా, చెల్లె ఎంబీబీఎస్ చదువుతున్నారు. తమ్ముడు డాక్టర్ లక్ష్యంగా నీట్‌కు ప్రీపేర్ అవుతున్నారు. గ్రూప్-1లో స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించిన కన్నం హరిణి, ఆమె తల్లిదండ్రులు కళాప్రపూర్ణ, రమేశ్‌ను బహుజన టీచర్స్ ఫెడరేషన్ (బీటీఎఫ్) పక్షాన రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము రమేశ్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు చిలుక దేవశంకర్, ఉపాధ్యక్షుడు బేజగం రమేశ్, మనుపాటి రాజయ్య, మేకల స్వరూప తదితరులు అభినందించారు.

పాలకుర్తి సందీప్‌కు 80వ ర్యాంకు..

గ్రూప్-1 పరీక్షా ఫలితాల్లో కరీంనగర్‌కు చెందిన పాలకుర్తి సందీప్ రాష్ట్రస్థాయిలో 80వ ర్యాంకు సాధించారు. సందీప్ తండ్రి కాశయ్య, కరీంనగర్‌లో సీసీఎస్ ఏసీపీగా పని చేస్తున్నారు. తల్లి భాగ్యలక్ష్మి గృహిణి. కరీంనగర్‌లోని వాణినికేతన్‌లో పదోతరగతి, ఆల్ఫోర్స్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదివిన సందీప్ తమిళనాడు అగ్రికల్చర్ యూనివర్సిటీలో బీఎస్సీ అగ్రికల్చర్, హైదరాబాద్ రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలో ఎమ్మెస్సీ అగ్రికల్చర్ చేశారు. నాలుగు నెలల క్రితం రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలో ఏవోగా విధుల్లో చేరారు. గ్రూప్-1లో 80వ ర్యాంకు రావడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

గ్రూపు-1లో గంభీరావుపేట

ఎస్ఐకి 89 ర్యాంక్



శ్రీకాంత్

గంభీరావుపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) గ్రూపు-1లో గంభీరావుపేట ఎస్ఐ శ్రీకాంత్ రాష్ట్రస్థాయిలో 89వ ర్యాంక్ సాధించారు. ఎస్టీ కేటగిరీలో మల్టీజోన్ పరిధిలో శ్రీకాంత్ మూడో ర్యాంక్ సాధించారు. ఎస్ఐ శ్రీకాంత్ ఓవైపు తన విధులను నిర్వహిస్తునే గ్రూపు-1 పరీక్షకు సన్నద్ధమై 489 మార్కులు సాధిం చాడు. హుస్నాబాద్ మండలం పూల్‌నాయక్ తండాకు చెందిన శ్రీకాంత్‌ది ముందు నుంచి వ్యవసాయ కుటుంబమే.

పోతారంలో 10వ తరగతి వరకు, బాసర ట్రిబుల్ ఐటీలో బీటెక్ చేశారు. వీఆర్‌వోగా, పంచాయితీ కార్యదర్శిగా కొలువులు సాధించి, కొంతకాలం సిద్దిపేట జిల్లాలో విధులు నిర్వహించాడు. 2020లో ఎస్ఐ ఉద్యోగం సాధించి, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని బొయినపల్లి, చందుర్తి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించారు. ప్రస్తుతం గంభీరావుపేట ఠాణాలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తూ మొక్కవోని దీక్షతో చదివి గ్రూప్-1 రాష్ట్రస్థాయిలో 89వ ర్యాంక్ సాధించాడు.

ప్రమాదాలకు నిలయంగా జాతీయ రహదారి

● అస్తవ్యస్తంగా విస్తరణ పనులు ● కనీస భద్రతా చర్యలు తీసుకోకపోవడంతో ప్రమాదాలు



మానకొండూర్‌లో ప్రమాదకరంగా ప్రయాణం



మానకొండూర్‌లో ప్రమాదకరంగా ఉన్న మూలమలుపు

మానకొండూర్/శంకరపట్నం, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నుంచి వరంగల్ వరకు నిర్మిస్తున్న 563 జాతీయ రహదారి రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. మానకొండూర్, శంకరపట్నం మండలాల్లో 20 కిలోమీటర్ల మేర రహదారి విస్తరించి ఉంది. ఈ రహదారి విస్తరణ పనులు అస్తవ్యస్తంగా సాగుతున్నాయి. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. మండలంలోని ఈదులగట్టెపల్లి గ్రామ శివారు నుంచి వెల్లుతున్న ఎస్సారెస్పీ కాకతీయ ప్రధాన కాల్వపై నిర్మించిన ఇరుకు వంతెన కావడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. చెంజర్ల బస్టాండ్ వద్ద ఫ్లైఓవర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులు కొనసాగుతున్నాయి. గట్టుదుద్దెనపల్లి గ్రామ శివారులో నుంచి వెల్లుతున్న ఎస్సారెస్పి కాకతీయ ప్రధాన కాల్వపై నిర్మించి ఇరుకు వంతెన ప్రమాదాలకు నిలయంగామారింది. శంకరపట్నం మండలంలో ఎన్‌హెచ్-563కొత్తగట్టు శివారులో ప్రారంభమై తాడికల్‌శివారుతో ముగుస్తుంది. జాతీయ రహదారిపై రోడ్డు ప్రమాదాలకు గురై పలువురు మృతిచెందారు. మరికొంత మంది తీవ్రంగా గాయపడ్డారు. ఓవైపు జాతీయరహదారి విస్తరణ పనులు నడుస్తున్నాయి. ఈ పనులు అస్తవ్యస్థంగా ఉండడం, పనులు జరిగేచోట సరైన సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇన్ని రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేషనల్‌హైవే అథారిటీ అధికారులు ఏ విధమైన హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేయడం లేదనే విమర్శలు వినిపి స్తున్నాయి. తరచుగా ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి వాటిని ప్రమాద జోన్లుగా నిర్ధారించి కాషన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరతున్నారు.



తాడికల్ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో నుజ్జు నుజ్జు అయిన ప్యాసింజర్ ఆటో(ఫైల్)

● ఇటీవల జరిగిన ప్రమాదాలు

⇨ శంకరపట్నం మండలం మక్తకు చెందిన షేక్‌అజీమ్ (35), అతని కుమారుడు అబ్దుల్ రహ్మాన్ (10)లు మోటర్ సైకిల్‌పై కేశవపట్నం నుంచి మక్తకు వెళ్తున్నారు. ఈ క్రమంలో కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై కేశవపట్నం బస్టాండ్ సమీపంలో వరంగల్ నుంచి కరీంనగర్ వెళ్తున్న లారీ బైక్‌ను ఎదురుగా ఢీ కొట్టడంతో తండ్రి, కొడుకులిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. వీరితో పాటు రోడ్డు పక్కన బైక్‌పై వెళ్తున్న మాందాడి శ్రీనివాస్‌రెడ్డికి తగలడంతో తీవ్రంగా గాయపడ్డాడు.

⇨ శంకరపట్నం మండలంలోని మొలంగూర్ గ్రామానికి చెందిన దండు కొంరయ్య తన స్వగ్రామం నుంచి హుజూరాబాద్‌కు వెళ్తున్నాడు. కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై మొలంగూర్ పెట్రోల్ బంకు ఎదురుగా డేనియల్ అనేవ్యక్తి కొంరయ్య బైకును వెనుకనుంచి ఢీ కొట్టాడు. దీంతో కొంరయ్య తలకు, కుడి కాలుకు గాయాలు కాగా, డేనియల్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

⇨ హనుమకొండకుచెందిన గుడిపాటి భూపాల్‌రెడ్డి, కుటుంబ సభ్యులు శ్రీనివాస్ రెడ్డి-రమాదేవి, సునీత, మానస, సుజాత, అయాన్ష్‌తో కలిసి కారులో కరీంనగర్‌లో ఓ వివాహానికి హాజరై తిరిగి హనుమకొండకు వెళ్తున్నారు. ఈక్రమంలో కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై తాడికల్, వంకాయ గూడెం గ్రామాల మధ్య కారు ఎదురుగా వస్తున్న బైక్‌ను, ప్యాసింజర్ ఆటోను, ట్రాలీ ఆటోను ఢీకొట్టి రోడ్డు పక్కన బోల్తా పడింది. కారులో ఎయిర్ బ్యాగ్స్ తెరుచుకోవడంతో అందులో ప్రయాణిస్తున్న వారికి స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఇన్నోవా ప్యాసింజర్ ఆటోను బలంగా ఢీ కొట్టడంతో ఆటో నుజ్జునుజ్జయింది. ఆటో డ్రైవర్ మానకొండూర్ మండలం గంగిపల్లికి చెందిన రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి.

⇨ హుజూరాబాద్ మండలం రాజపల్లి గ్రామానికి చెందిన మహ్మద్ హైమద్ తన వ్యక్తిగత అవసరాల రీత్యా కేశవపట్నం వచ్చి తన స్వగ్రామం రాజపల్లికి వెళ్తుండగా మార్గ మధ్యలో కొత్తగట్టు వద్ద బైక్ అదుపు తప్పి ఒకసారిగా కింద పడడంతో తలకు, మోకాలుకు తీవ్రమైన గాయాలయ్యాయి.

⇨ శంకరపట్నం మండలం కొత్తగట్టు శివారులో కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై లారీ బైక్ ఢీ కొన్న ఘటనలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. వీణవంక మండలం బేతిగల్ గ్రామానికి చెందిన ముద్దమల్ల హరీస్ (23) లారీ బైక్ ఢీ కొన్న ఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడు.

⇨ శంకరపట్నం మండలం తాడికల్ శివారులో ఆర్టీసీ బస్సును లారీ ఢీ కొన్న సంఘటనలో ఇద్దరు ప్రయాణికులకు గాయాలయ్యాయి.

⇨ శంకరపట్నం మండలం తాడికల్ శివారులో కరీంనగర్-వరంగల్ జాతీయ రహదారిపై రెండు ఆర్టీసీ బస్సులు ఎదురెదురుగా ఢీ కొన్నాయి.

⇨ తాడ్వాయి మండలం బీరెల్లి గ్రామానికి చెందిన 8మంది ట్రాలీ ఆటోలో వేములవాడ దైవ దర్శనానికి బయలుదేరారు. ఈ క్రమంలో వంకాయగూడెం వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న గ్రానైట్ లారీ ఆటో ట్రాలీని ఢీ కొట్టింది. ఈ ఘటనలో ట్రాలీ ఆటోలో ప్రయాణిస్తున్న ఆనంద్‌వర్ధన్, సూర్యప్రకాష్, ఇషాని ముగ్గురు వ్యక్తులు గాయపడ్డారు.

⇨ శంకరపట్నం మండలంలోని మక్త గ్రామానికి చెందిన పంచకోటి గోపి (30) బైక్‌పైన వంకాయగూడెం గ్రామ శివారులోని ఓ హోటల్‌కు వెళ్లి సర్వపిండి తీసుకొని బైక్‌పై తన హార్వేస్టర్ రిపేర్ షాపు వైపు వస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా హుజూరాబాద్ వైపు నుంచి వస్తున్న లారీ డ్రైవర్ అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ బైక్‌ను ఢీ కొట్టడంతో గోపి తలకు తీవ్రమైన గాయాలు కాగా అక్కడికక్కడే మృతి చెందాడు.

ఎప్పటికి పూర్తయ్యేనో..?

- అసంపూర్తిగా అదనపు తరగతి గదులు
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు

ఎల్లారెడ్డిపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో పాఠశాలల అభివృద్ధికి చేపట్టిన పనులు ఇప్పటికీ పూర్తి కావడం లేదు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి కార్పొరేటు స్థాయిలో గ్రామీణ ప్రాంత విద్యార్థులకు విద్యను అందించేందుకు శ్రీకారం చుట్టినా ఆశించిన ప్రయోజనం చేకూరడం లేదు. దీంతో శిథిలమైన తరగతి గదుల్లో విద్యార్థులు బిక్కు బిక్కుమంటూ పాఠాలు వినాల్సిన దుస్థితి నెలకొంది.



నిలిచిపోయిన తరగతి గదుల భవన నిర్మాణం

● నిలిచిన నిర్మాణాలు..

మండలంలోని రాచర్లబొప్పాపూర్, నారాయణపూర్, అల్మాస్‌పూర్, వెంకటాపూర్, రాజన్నపేట, బండలింగంపల్లి, రాచర్లగొల్లపల్లి, సింగారం గ్రామాల్లోని ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను గత ప్రభుత్వం 'మన ఊరు-మన బడి' పథకం కింద ఎంపిక చేసి అభివృద్ధి పనులకు రూ.కోటి 57 లక్షల నిధులను కేటాయించింది. రెండేళ్ల కిందట పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్లు తరగతి గదుల నిర్మాణాన్ని ప్రారంభించారు. పాత భవనాలను తొలగించి అదే స్థలంలో పనులను చేపట్టారు. అల్మాస్‌పూర్, వెంకటాపూర్, రాజన్నపేట, బండలింగంపల్లి, రాచర్లగొల్లపల్లి, సింగారం గ్రామాల్లో పనులు చివరి దశకు చేరుకున్నాయి. మంజూరైన నిధుల్లో రూ.61 లక్షలు చెల్లించగా, మిగతా రూ.21లక్షలు చెల్లించాల్సి ఉంది. రాచర్లబొప్పాపూర్‌లో రూ.49.96, నారాయణపూర్‌లో రూ.26 లక్షలు కలిపి మొత్తం రూ.75.96లక్షలు చెల్లించాల్సి ఉండగా ఒక్క రూపాయి చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు అర్ధంతరంగా పనులను నిలిపివేశారు.

● నిర్మాణాలు నిలిచిపోయాయి.

బిల్లులు రాకపోవడంతో పనులను నిలిపివేశారు. గత ఏడాది అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం పేరిట అదనపు తరగతి గదుల నిర్మాణాలను చేపట్టింది. గత ప్రభుత్వంలో చేపట్టిన తరగతి గదుల నిర్మాణాలకు బిల్లులు ఇప్పటికీ చెల్లించలేదు. రాచర్లబొప్పాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మొత్తం 445 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ఒకే గదిలో ల్యాబ్, గ్రంథాలయం, డెస్కులు ఉండగా, తరగతులను కూడా నిర్వహిస్తున్నారు. ఇరుకు గదిలో పాఠాలు వినేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రహరీ లేకపోవడం వల్ల పందులు, కుక్కలు పాఠశాల ఆవరణలోకి వస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

ప్రయోగాలు చేయలేకపోతున్నాం..


- అల్లె ప్రణతి, 9వ తరగతి విద్యార్థిని, రాచర్లబొప్పాపూర్



పాఠశాలలో పాత తరగతి గదులను తొలగించి నిర్మాణ పనులను చేపట్టారు. యేడాది దాటినా పనులు పూర్తి కాలేవు. గదులు లేక ల్యాబ్ మూలకు పడింది. ప్రయోగాలు చేయలేకపోతున్నాం. అధికారులు స్పందించి తరగతి గదుల నిర్మాణాలను పూర్తి చేయాలి.

ఉన్నతాధికారులకు నివేదిస్తాం..

- కృష్ణహరి, ఎంఈవో



గత ప్రభుత్వం 'మన ఊరు- మన బడి' కింద రెండేళ్ల తరగతి గదులు, మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించింది. రాచర్లబొప్పా పూర్, నారాయణపూర్ గ్రామాల్లో పనులు నిలిచిపోయాయి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులు పూర్తయేలా చర్యలు చేపడుతాం.

రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి తీవ్రగాయాలు

● ముగ్గురి పరిస్థితి విషమం

ఎల్లారెడ్డిపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్‌నగర్ గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై ఆటో, ద్విచక్రవాహనం ఆదివారం రాత్రి ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో మండలంలోని నారాయణపూర్, హరిదాస్‌నగర్ గ్రామాలకు చెందిన యువకులు హఫీజ్, అఫ్రోజ్, రఘుపతితో పాటు మరో ఇద్దరు తీవ్రగాయాల పాలయ్యారు. రంజాన్ పండుగ సందర్భంగా నూతన దుస్తులు కొనుగోలు చేసేందుకు హఫీజ్, అఫ్రోజ్‌లు కలిసి ద్విచక్రవాహనంపై సిరిసిల్ల వైపునకు వెళుతున్నారు. రఘుపతితో పాటు మరో ముగ్గురు ఆటోలో సిరిసిల్ల నుంచి హరిదాస్‌నగర్‌కు వస్తున్న క్రమంలో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి.

దీంతో హఫీజ్, అఫ్రోజ్, రఘుపతి పరిస్థితి విషమంగా ఉంది. హఫీజ్, అఫ్రోజ్‌ను ఎల్లారెడ్డిపేటకు, రఘుపతితో పాటు మరో ఇద్దరిని సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని రహదారిపై ఉన్న వాహనాలను తొలగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని పోలీసులు వివరించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ఇల్లంతకుంట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. ఎస్సై వివరాలప్రకారం కేసన్నపల్లె గ్రామానికి చెందిన వడిజె అఖిల్ ఎలాంటి అనుమతులు లేకుండా శనివారం అర్ధరాత్రి ఇసుకను తరలిస్తున్నారనే సమాచారం మేరకు రెవన్యూ శాఖ అధికారులు దాడిచేసి పట్టుకున్నట్లు తెలిపారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడిని రిమండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

వైభవంగా ఉగాది వేడుకలు

● ఆలయాల్లో కిక్కిరిసిన భక్తులు



ఆలయంలో పట్నాలు వేస్తున్న ఒగ్గుపూజారులు

ఓదెల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): స్వస్తిశ్రీ విశ్వావసునామ ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని భ్రమరాంబ మల్లికార్జున స్వామి క్షేత్రంలో ఆదివారం వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయంలో స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, ప్రత్యేక అర్చనలు, పారాయణాలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పెద్దఎత్తున వచ్చిన వాహనాలకు పూజలు నిర్వహించారు. గతంలో నిర్వహించిన ఎడ్లబండ్ల ప్రదక్షిణలు కనబడలేదు. వాటి స్థానంలో వాహనాలకే రథాలను తయారుచేసి ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. హరిపురం గ్రామానికి చెందిన యాదవ భక్తులు మేకల బండ్లతో ప్రత్యేక ప్రదక్షిణలు నిర్వహించారు. జమ్మికుంట, సుల్తానాబాద్, మంచిర్యాల, మందమర్రితో పాటు ఇతర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి రావడంతో స్వామివారి దర్శనానికి మూడు గంటల సమయం పట్టింది. అనంతరం అధిక సంఖ్యలో భక్తులు ఒగ్గు పూజారులతో పట్నాలు వేయించి మొక్కులను సమర్పించారు. అలాగే పొత్కపల్లిలో రాజగోపాలస్వామి, భవాని సహిత మహా లింగేశ్వర స్వామి, మడకలో ఉమామహేశ్వర స్వామి, కనగర్తిలో శివాలయం, ఆంజనేయస్వామి, కొలనూర్ లో మల్లన్న గుట్ట వద్ద ఉగాది వేడుకలు, వాహనాల పూజలు నిర్వహించారు. అనంతరం మల్లన్న జాతరతోపాటు ఓదెల సీతారామచంద్రస్వామి, శివాలయం అలాగే గుంపుల రామభద్ర ఆలయంలో ప్రత్యేక పూజలతోపాటు భక్తి శ్రద్ధలతో పంచాంగ శ్రవణాన్ని నిర్వహించారు. ఇళ్ల ముంగిట మహిళలు రంగవల్లులతో వాకిళ్లను అలంకరించి, పచ్చని తోరణాలతో ఉగాది వైభవాన్ని చాటారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండ ఏఎస్ఐ సుధాకర్ ఆధ్వర్యంలో పొత్కపల్లి పోలీస్ సిబ్బంది బందోబస్తు చర్యలు తీసుకున్నారు. ఉగాది వేడుకలకు దాదాపు 15 వేల మంది భక్తులు హాజరయ్యారు.



ఓదెల ఆలయంలో మేకలబండ్లతో భక్తుల ప్రదక్షిణలు

● టాటా వారి సహకారంతో
ఏటీసీ సెంటర్ ఏర్పాటు
● 60వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన
పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐ



పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐ కళాశాల

నూతన కోర్సులతో ఐటీఐకి పూర్వ వైభవం



ప్రభుత్వ ఏటీసీ సెంటర్

పెద్దపల్లి కల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా కేంద్రం గత వైభవాన్ని సంతరించుకుంటోంది. 59 ఏళ్లు పూర్తిచేసుకుని 60వ యేట అడుగుపెడుతున్న ఈ ఐటీఐ ఉత్తర తెలంగాణకు ఒక ఎంప్లాయిమెంట్ కేంద్రంగా కీర్తి గడిచింది. కోల్‌బెల్ట్, ఎన్టీపీసీ, నాటి ఎఫ్‌సీఐ ఎరువుల కర్మగారానికి, రామగుండం థర్మల్ పవర్‌స్టేషన్‌లకు టెక్నికల్ ఉద్యోగులను అందించింది.

1964లో పెద్దపల్లిలో ప్రారంభమైన ఈ ఐటీఐకి టెక్నికల్ విద్యనభ్యసించే వారికి ఒక వరం ఉండేది. మొదట ఫిట్టర్, టర్నల్, మిషినిస్ట్, మోటార్ మెకానిక్, డీజిల్ మెకానిక్, ఆర్ అండ్ టీవీలకే పరిమితమైంది. ప్రస్తుతం ఈ ఐటీఐ అధునాతన కోర్సులకు స్వాగతం పలికింది. 20 ఎకరాల రెండు గుంటల్లో ఐటీఐ విస్తరించి ఉంది. ఇందులోనే జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం కూడా ఉంది. గతంలో కలెక్టరేట్ ఉంటే దానిని సొంత భవనంలోకి మార్చారు.

ఏటీసీ సెంటర్లో కొత్త కోర్సులు

పెద్దపల్లి ఐటీఐలో కొత్తగా నిర్మాణం చేసిన ఏటీసీ సెంటర్లో కొత్త కోర్సులు వచ్చాయి. అడ్వాన్స్‌డ్ సీఎస్‌సీ, అడ్వాన్స్‌డ్ టూల్ యూసింగ్‌తోపాటు బేసిక్ డిజైనర్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ ఆటోమేషన్, మెకానిక్ ఎలక్ట్రికల్ వెహికల్స్ మొదలగు కొత్త కోర్సులు వచ్చినట్టు పేర్కొన్నారు.

● 646 మంది విద్యార్థులు

ఐటీఐలో ఎలక్ట్రిషన్ ఐదు యూనిట్లు, ఫిట్టర్ ట్రేడ్ రెండు యూనిట్లు, టర్నర్, మిషన్ ట్రేడ్, మోటార్ మెకానిక్ ట్రేడ్, వెల్డర్, కోపా, ఎలక్ట్రానిక్, డిజిల్ మెకానిక్ ట్రేడ్ రెండు యూనిట్ల చొప్పున నడుస్తున్నాయి. ఒక్కొక్క యూనిట్లో 20 నుంచి 22 మంది విద్యార్థులు ఉంటారు. విశాలమైన ప్రాక్టికల్ రూములు డ్రిల్ మిషన్స్ లేత్ మిషన్స్, గ్రైండింగ్ మిషన్స్ తదితర మిషన్‌లు అందుబాటులో ఉన్నాయి.



తరగతి గదిలో విద్యార్థులు

● ఏటీసీ సెంటర్ నిర్మాణం

టాటా కంపెనీ వారు రూ.475 కోట్ల ఎస్టిమేషన్‌తో ఇక్కడ ఏటీసీ (అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్) నిర్మాణంతోపాటు దాన్ని నడిపించడానికి సిబ్బందిని నియమించారు. దీనిలో భాగంగా రూ.4.5 కోట్లతో ఏటీసీ భవన నిర్మాణం జరిగి రూ.33.5 కోట్లతో మిషన్ల ఏర్పాటు చేస్తున్నారు. దీనితోపాటు ముగ్గురు మాస్టర్లను కంపెనీ నియమించింది. ఏటీసీ సెంటర్‌కు 85 శాతం పెట్టుబడి టాటా కాగా, 15 శాతం రాష్ట్ర ప్రభుత్వం ఇస్తుంది. సీఎస్ఆర్ ఫండ్స్ కింద రూ.14 లక్షలు కలెక్టర్ కేటాయించారు. ఏటీసీ సెంటర్‌లో ఆరు ట్రేడ్‌లు మూడు యూనిట్లను ఏర్పాటుచేశారు. రెండు సంవత్సరాల కోర్సులు ఒక సంవత్సరం కోర్సు కూడా ఉంది. అలాగే కలెక్టర్ కోయ శ్రీహర్ష ఐదు లక్షలు రా మెటీరియల్ సమకూర్చడంతోపాటు డ్రింకింగ్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయించారు.

● జిల్లాలో ఆరు ప్రైవేటు ఐటీఐలు వెయ్యి మంది విద్యార్థులు

జిల్లాలో రెండు ప్రభుత్వ ఐటీఐలతోపాటు ఆరు ప్రయివేటు ఐటీఐలు కూడా నడుస్తు న్నాయి. పెద్దపల్లిలో సింధూర, కాకతీయ, శివ సాయి ఐటీఐలు ఉండగా, గోదావరిఖని ప్రాంతంలో గౌతమి, శివశక్తి, సారథి ఐటీఐ ఉన్నాయి. వీటిలో సంవత్సరానికి వెయ్యి మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

● అభివృద్ధి.. సమస్యలు

పెద్దపల్లి ప్రభుత్వ ఐటీఐలో యేటా అప్రెంటీస్‌షిప్ నిర్వహిస్తున్నామని, ప్రతీసారి 200 మందికి అప్రెంటీస్‌షిప్ అందించి జాబ్ మేళా ద్వారా ఉద్యోగాలు కల్పిస్తున్నామని ప్రిన్సిపాల్ వెంకట్‌రెడ్డి అన్నారు. ఈ మధ్యనే 100 మందికి జాబ్ మేళాలో జాబ్ కూడా ఇవ్వడం జరిగిందన్నారు. రెండు వైపులా గేట్ల నిర్మాణం చేపట్టి వాకింగ్ ట్రాక్‌తో మైదానం కళకళ లాడుతుందన్నారు. కాంపౌండ్ వాళ్ళు ఒకచోట కూలిందని దాని నిర్మాణం తో పాటు రూ.14 లక్షల విద్యుత్ బకాయిలను చెల్లించాల్సి ఉందని అన్నారు.

● నూతన ట్రేడ్‌లకు అనుగుణంగా స్టాఫ్‌ను పెంచాలి

నూతన ఏటీసీ సెంటర్‌లో ఉన్న కొత్త ట్రేడ్లకు అనుగుణంగా స్టాఫ్‌ను నియమించాల్సి ఉంది. ప్రస్తుతం ఉన్న స్టాఫ్ 50 ఏళ్ళ పైబడిన వారే ఉన్నారు. వారిలో కొందరు సీటీఐ చేసిన వారు, మరి కొందరు డిప్లమా, కొంత అవుట్ సోర్సింగ్ ద్వారా వచ్చిన వారు ఉన్నారు. ఏటీసీ సెంటర్‌లో వచ్చిన కొత్త కోర్సులకు అనుగుణంగా బీటెక్, ఏటీఐ, సీటీఐ నుంచి టెక్నికల్ స్టాఫ్ వస్తేనే న్యాయం జరుగుతుంది.

ఐటీఐ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

- వెంకటరెడ్డి, ఐటీఐ ప్రిన్సిపాల్ , పెద్దపల్లి



పెద్దపల్లి ఐటీఐలో అందిస్తున్న కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా వస్తున్న నూతన కోర్సులపై అవగాహన పెంచుకొని కోర్సులో చేరి ఉన్నత ఉద్యోగాలు సాధించాలి.

వేములవాడలో ఘనంగా ఉగాది వేడుకలు

● స్వామి వారికి ప్రత్యేక పూజలు ● పెద్దఎత్తున తరలివచ్చిన భక్తులు



వేములవాడలో కన్నుల పండువగా స్వామివారి రథోత్సవం



శ్రీసీతారామచంద్ర స్వామి వారికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

వేములవాడ కల్చరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో ఆదివారం ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉగాది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ఆలయ అర్చకులు రాజరాజేశ్వరస్వామి వారితో పాటుగా అనుబంధ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి అభిషేక పూజలు చేశారు. నూతన పంచాంగ పుస్తకాలను స్వామి వారి చెంతవుంచి పూజలు నిర్వహించారు. రాజన్న ఆలయ ప్రాంగణంతో పాటు ఆలయ పరిసరాలను పూలతో అందంగా అలంకరించారు.

● భక్తుల రద్దీ..

ఉగాది నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులు లక్ష్మీగణపతి, రాజన్నను, పార్వతీదేవి అమ్మవారిని దర్శించుకుని తరించారు. అనుబంధ ఆలయాల్లో అనంతపద్మనాభస్వామి, సీతారామచంద్రస్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలో పాల్గొని తరించారు.

● వైభవంగా స్వామివారి రథోత్సవం..

వేములవాడ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయంలో ఉగాది, శ్రీరామనవమి ఉత్సవాలను పురస్కరించుకొని ఆదివారం స్వామివారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవమూర్తులను అంబారి సేవపై పట్టణ వీధులగుండా ఊరేగించారు. కార్యక్రమంలో భక్తులు పెద్దసంఖ్యలో హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

కొండగట్టులో..

మల్యాల: కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో ఆదివారం ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. స్వామి వారికి చందనలంకారం, అభిషేకాలను ఆలయ అర్చకులు, వేదపండితులు నిర్వహించారు. ఆలయ అధికారులు దేవస్థానం తరపున పట్టువస్త్రాలను సమర్పించారు. వెంకటేశ్వర స్వామికి పంచామృత అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, రుద్రాభిషేకం నిర్వహించారు.

ఆదివరాహస్వామి సన్నిధిలో..

కమాన్‌పూర్: మండల కేంద్రంలోని ఆదివరహస్వామి సన్నిధిలో ఆదివారం ఉగాది ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆలయానికి ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామి వారికి పూజలు చేశారు. వాహనదారులు ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ ఆచార్యులు కలకుంట్ల వరప్రసాద్ పంచాంగ శ్రవణం చేశారు. కమాన్‌పూర్ పిరమిడ్ స్వచ్ఛంద సంస్థవారు భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించారు. ఆలయానికి పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో ఎలాంటి ఆవాంఛనీయ సంఘటన జరుగకుండా టూటౌన్ సీఐ ప్రసాదరావు, ఎస్ఐలు కె.ప్రసాదరావు, రవళి, ఏఎస్ఐ బాలజీ, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు, ఆర్‌జీ 2 జీఎం సుధాకర్‌రావు, యూట్యూబర్ వర్షిని, ముత్యాల దామోదర్, ఇనుగంటి రామారావు, కిషన్‌రెడ్డి తదితరులు ఉగాది ఉత్సవాలలో పాల్గొన్నారు.

ధర్మపురిలో భక్తుల పూజలు..

ధర్మపురి: లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ దేవాలయాల్లో వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య అర్చకులు నిత్య పూజలు, అభిషేకాది కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం నుంచియే పవిత్ర గోదావరి నదిలో స్నానాలు ఆచరించిన భక్తులు స్వామి వారలను దర్శనం చేసుకున్నారు. ఆలయాలు భక్తి గీతాలతో ప్రతిధ్వనించాయి. రాత్రి వరకు భక్తులతో ఆలయాల్లో రద్దీ నెలకొంది.



కమాన్‌పూర్: ఆదివరాహస్వామి ఆలయంలో బారులు తీరిన భక్తులు



రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

ధర్మపురి, కొండగట్టులో ఘనంగా పంచాంగ శ్రవణం



కొండగట్టులో పంచాంగ శ్రవణం చేస్తున్న అర్చకులు

ధర్మపురి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నృసింహస్వామి దేవాలయం ఆవరణలో గల శేషప్ప కళావేదికపై ఆదివారం శ్రీ విశ్వావసు నామ సంవత్సర పంచాంగ శ్రవణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయం నుంచి లక్ష్మీ నృసింహస్వామి (యోగ, ఉగ్ర) వారల ఉత్సవ మూర్తులను శేషప్ప కళావేదికపై తీసుకువచ్చారు. అనంతరం ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ తదితర వేదబ్రాహ్మణుల మంత్రోచ్చరణల మధ్య ప్రత్యేకపూజలు జరిపారు. ఈ సందర్భంగా ప్రముఖ జ్యోతిష్య పండితులు బుగ్గారపు రాజేంద్రప్రసాద్‌శర్మ నూతన శ్రీ విశ్వావసునామ సంవత్సర పంచాంగం పఠించారు. ఏడాదిలో రాశులకు సంబంధించిన ఆదాయ, ధన, వ్యయ, అధికారం, రాజయోగంతోపాటు ప్రకృతి వైపరీత్యాలు, వర్షాలు, పంటలు, ఫలాల గురించి వివరించారు. జ్యోతిష్యపండితులు బుగ్గారపు రాజేంద్రప్రసాద్‌శర్మను ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ధర్మకర్తలు ఒజ్జల సౌజన్య, బాదినేని వెంకటేష్, రాపర్తి సాయికుమార్, గుడ్ల రవీందర్, నేదునూరి శ్రీధర్, బొల్లారపు పోచయ్య, స్తంభంకాడి గణేష్, మందుల మల్లేష్, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, అభిషేక్ పాల్గొన్నారు.

కొండగట్టులో..

మల్యాల: కొండగట్టు ఆంజనేయ స్వామి సన్నిధిలో ప్రత్యేక వేదికపై ఆలయ ప్రధాన అర్చకులు జితేంద్రప్రసాద్ పంచాంగశ్రవణం చేయగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం నివేదన కార్యక్రమాలు జరిపారు. కార్యక్రమంలో ఈవో శ్రీకాంత్ రావు, ప్రధానర్చకులు రామకృష్ణ, రఘు, పర్యవేక్షకులు హరిహరనాథ్, సునీల్, చంద్రశేఖర్, ఆలయఅర్చకులు, అధికారులు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం కొండపైన రూ.35 లక్షలతో చేపడుతున్న జీవ షెడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే సత్యం భూమి పూజ చేశారు.



ఉగాది పంచాంగ శ్రవణంలో పాల్గొన్న ప్రభుత్వ విప్, ఆలయ చైర్మన్, ఆలయ ఈవో, ప్రముఖులు, భక్తులు

తాగునీటి కోసం పోచమ్మతండా వాసుల ఆందోళన

ఎల్లారెడ్డిపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుండారం గ్రామ పంచాయతీ పరిధిలోని పోచమ్మతండా గిరిజన మహిళలు ఆదివారం తాగునీటి కోసం ఆందోళన చేశారు. తండాలో 16 కుటుంబాలు జీవిస్తున్నాయని, తాగేందుకు నీటికి తల్లాడిల్లుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. చుక్కనీరు లేక పండుగ పూట పనులు చేసుకోలేకపోయామని ఆవేదన వ్యక్తంచేశారు. పదిహేను రోజులనుంచి తండాలో తాగునీటికి ఇబ్బం దులు పడుతున్నామని వాపోయారు. ఇప్పటికైనా సంబంధితశాఖ అధికారులు స్పందించి తాగునీటి సమస్యను తీర్చాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గ్రామ పంచాయతీ కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాలను ముట్టడిస్తామని మహిళలు హెచ్చరించారు.



బిందెలు, డ్రమ్ములు, బకెట్లతో ఆందోళన చేస్తున్న మహిళలు

బీర్‌పూర్‌లో ఎడ్లబండ్ల పోటీలు

బీర్‌పూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రతి సంవత్సరం ఎడ్లబండ్ల పోటీలను ఘనంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆదివారం నిర్వహించిన ఎడ్లబండ్ల పోటీలను జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో కేడీసీసీ జిల్లా మెంబర్ ముప్పాల రాంచందర్‌రావ్, సారంగాపూర్ మాజీసర్పంచ్ గుర్రాల రాజేందర్ రెడ్డి, గోణె రమణ రావ్, మాజీ ఉపసర్పంచ్ హరీష్, కృష్ణరావ్, నేరెల్ల సుమన్, శ్రీనివాస్, రాజేశం, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



ఎడ్లబండ్ల పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

పంటలను కాపాడాలని అంజన్నకు ముడుపు

ఎల్లారెడ్డిపేట, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): సాగుచేసిన పంటలను కాపాడాలని వేడుకుంటూ ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లోని ఆంజనేయస్వామి ఆలయంలో రైతులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు వేణుగోపాలచారి ఆధ్వర్యంలో పూజలు జరిపించారు. వడగళ్ల వానలు కురవకుండా పంటలను రక్షించాలని ముడుపు వేశారు. ప్రతి యేటా ఉగాది పండుగ రోజున ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి ముడుపు వేయడం అనాదిగా వస్తున్న ఆచారమని రైతులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ హన్మండ్లు, మాజీ సర్పంచులు నర్సయ్య, లక్ష్మీనారాయణరెడ్డి, మాజీ ఉప సర్పంచ్ మహేందర్, నాయకులు మల్లారెడ్డి, నర్సయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న రైతులు

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కొడిమ్యాల ఎంపీడీవో స్వరూప



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎల్‌ఆర్ ఎస్‌కు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి?

ఎంపీడీవో: మండలంలో ఎల్‌ఆర్‌ఎస్‌కు సంబంధించి 552 దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటి వరకు 33మంది ఫీజు చెల్లించారు. ప్లాట్ల వినియోగదారులు ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

ఆంధ్రజ్యోతి: ఎల్‌ఆర్‌ఎస్‌తో ప్రయోజనాలు ఏమిటి?

ఎంపీడీవో: ఎల్‌ఆర్‌ఎస్‌తో భవిష్యత్తులో భూముల అమ్మకాలు, కొనుగోలు చేయటం సులభంగా ఉంటుంది. ఎల్‌ఆర్‌ఎస్ ఉంటేనే నిర్మాణాలకు అనుమతిని పొందవచ్చు.

ఆంధ్రజ్యోతి: ఎప్పటి వరకు గడువు ముగియనుంది?

ఎంపీడీవో: ప్రభుత్వ నిబంధనల మేరకు ఎల్‌ఆర్‌ఎస్ చెల్లించేందుకు ఈనెల 31వరకు గడువు ఉంది. ఈలోపు చెల్లిస్తే ఫీజులో 25 శాతం రాయితీ ఉంటుంది.

-కొడిమ్యాల

ఉచిత కంటి శస్త్ర చికిత్సలు

జగిత్యాల అర్బన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల నియోజక వర్గంలోని 20మంది నిరుపేదలకు జగిత్యాల పావని కంటి ఆసుపత్రి, ఆపి, రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి శస్త్ర చికిత్సలు చేసి అద్దాలు, మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, డాక్టర్ వెంకటేశర్లు కాశీ రావు, సుధాకర్‌రావు, కొత్త ప్రభాకర్,కోరె గంగమల్లు, జుంబర్తి రాజ్‌కుమార్, పెద్దింటి రాజు, ప్రవీణ్ రావు, శ్రీరాం బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

జగిత్యాల మున్సిపల్ మాజీ కౌన్సిలర్ పంబాల రాము సోదరి స్వప్న అనారోగ్యంతో బాద పడుతూ జగిత్యాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఆమెను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే వెంట నాయకులు బద్దం జగన్మోహన్‌రెడ్డి, చుక్క నవీన్, ప్రవీణ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదం

జగిత్యాలరూరల్, మార్చి30 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలంలోని పొరండ్ల గ్రామానికి చెందిన బేతి లక్ష్మారెడ్డి ఇంట్లో ఆదివారం ప్రమాద వశాత్తు షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం సంభవించి ఇంటిలోని విలువైన వస్తువులు, రెండు లక్షల 50 వేల రూపాయల నష్టం వాటిల్లిందని బాధితుడు లక్ష్మారెడ్డి తెలిపారు. ప్రభుత్వపరంగా ఆదుకోవాలని కోరారు.

విశ్వావసు నామ సంవత్సర పంచాంగ శ్రవణం

-ఘనంగా ఉగాది వేడుకలు -కిటకిటలాడిన దేవాలయాలు



కోరుట్లలో పంచాంగ శ్రవణం చేస్తున్న వేద పండితుడు జయరాం శర్మ



రాయికల్ చెన్నకేశవ ఆలయంలో పంచాంగ శ్రవణం

కోరుట్ల/కోరుట్ల రూరల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం ఉగాది వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు దేవాలయాలలో విశ్వావసు నామ సంవత్సర పంచాంగ శ్రవణాన్ని దేవాలయాల పురోహితులు, వేదపండితులు వినిపించారు. పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో వేదపండితుడు పాలెపు రాంశర్మ, వేంకటేశ్వర దేవలయంలో పాలెపు జయరాం శర్మ, నగేశ్వర దేవలయంలో పాలెపు రాజేశ్వర్ శర్మ, మహదేవ స్వామి దేవాలయంలో పాలెపు బరద్వాజ్ శర్మ, మార్కండేయ మందిరంలో ప్రదీప్ పంచాంగ శ్రవణం చేశారు.మండలంలోని నాగులపేట గ్రామంలో బ్రహ్మన్నగారి శంకర్ శర్మ పంచాంగ శ్రవణం చేశారు. పట్టణంలోని నంది చౌరస్తా వద్ద గత నదీశ్వర దేవాలయంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పట్టణంలోని జువ్వాడి భవనంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు.

●**మెట్‌పల్లి రూరల్:** శ్రీవిశ్వావస తెలుగు నూతన సంవత్సరాది ఉగాది మొదలుకుని అందరికీ శుభాలు కలగాలని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు అన్నారు. ఆదివారం ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని వెల్లుల్ల గ్రామ శివారులోని దసరా గుట్టపైన ఉన్న శ్రీ ప్రహ్లాద వరద లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి, నాయకులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

●**మల్యాల:** మల్యాలతో పాటు పలు గ్రామాల్లో పంచాంగ శ్రవణం, ధ్వజారోహణ కార్యక్రమాలు చేసి షడ్రుచుల పచ్చడిని పంపిణీ చేశారు.

●**రాయికల్:** మండల కేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీ చెన్నకేశవనాథ ఆలయంలో ఆలయ అర్చకులు సతీష్‌శర్మ ఆధ్వర్యంలో పండితులు మునుగోటి సత్యనారాయణ శర్మ, మునుగోటి సాయి సుధీర్ శర్మలు పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్, గుడికోట ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మచ్చ శ్రీధర్ పాల్గొన్నారు. ఒడ్డె లింగాపూర్, ఇటిక్యాల, అల్లీపూర్ ఆలయాల్లో పంచాంగ శ్రవణాలు నిర్వహించారు.

●హిందూ కుటుంబ జీవన విధానం ప్రపంచానికే ఆదర్శమని సామాజిక సమరసత తెలంగాణ ప్రాంత ప్రముఖ్ అప్పాల ప్రసాద్ జీ అన్నారు. రాయికల్ మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆలూరు, మైతాపూర్, కుమ్మరిపెల్లి, రామాజీపేట, తాట్లవాయి గ్రామాల్లో ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఖండ కార్యవాహ్ వేల్పుల స్వామి, తురగ రాజరెడ్డి, దొంగ జితేందర్ రెడ్డి, తోపారపు రవీందర్ పాల్గొన్నారు.



వెల్లుల్లలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు

●**బీర్‌పూర్:** మండలంలోని ఆయా గ్రామాల్లో ఉగాది వేడుకలను జరుపుకున్నారు. బీర్‌పూర్ శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో, తుంగూర్ గ్రామంలోని రాజరాజేశ్వరస్వామి, వేణుగోపాలస్వామి ఆలయాల్లో, కొల్వాయి గ్రామంలోని రామాలయంలో అర్చకులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. బీర్‌పూర్ లక్ష్మీనరసింహస్వామి, తుంగూర్ గుట్ట రాజరాజేశ్వర స్వామి ఆలయాల్లో ఉత్సవ మూర్తులను శావలో ప్రదక్షిణలు నిర్వహించారు.

●**సారంగాపూర్:** మండల ప్రజలకు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఇంట సిరి సంపదలతో, పాడి పంటలు, ఆయురారోగ్యాలతో సుభిక్షంగా ఉండాలని ఈసందర్భంగా ఆకాక్షించారు.

●**భీమారం:** మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ఉగాది వేడుకలను నిర్వహించారు. మండల కేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు పంచాంగ శ్రవణం నిర్వహించారు.

●**మల్లాపూర్:** మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో ఉగాది వేడుకలను జరుపుకున్నారు. షడ్రుచుల సమ్మేళనంతో కూడిన ఉగాది పచ్చడిని సేవించారు. ఆయా ఆలయాల్లో జరిగిన పంచాంగ శ్రవణంలో ప్రజలు పాల్గొన్నారు.

●**కొడిమ్యాల:** మండలంలోని వివిధ గ్రామాల్లో ఉగాది వేడుకలను జరుపుకున్నారు. మండల కేంద్రంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, రామాలయం, ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

●**గొల్లపల్లి:** మండలంలో ప్రజలు ఉగాది వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. తీపి చేదు కలయికలతో ఉగాది పచ్ళ్లను తయారు చేసి సేవిం చారు. మండలంలోని పలు ఆలయాలు భక్తులతో పోటెత్తాయి. ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా పూజారులు పంచాంగ శ్రవణం చేశారు. ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మండల ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ కొత్త సంవత్సరంలో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు.

●**పెగడపల్లి:** మండలంలో విశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో గుండి రాజేశ్వరశర్మ పంచాంగ శ్రవణం నిర్వహించారు. గ్రామంతో పాటు రాశుల వారీగా ఆదాయ వ్యయాలు చదివి వినిపించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఒరుగల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మేరుగు శ్రీనివాస్, కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.



బీర్‌పూర్‌లో లక్ష్మీనరసింహస్వామి పల్లకీ సేవ



కొడిమ్యాలలో వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

జిల్లాలో మండుతున్న ఎండలు

జగిత్యాల అర్బన్, మార్చి 30 ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. జిల్లాలోని ఇబ్రహీంపట్నం మండలం గోదూర్‌లో అత్యధికంగా 41.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాయికల్, వెల్గటూర్, భీమారం మండలం మన్నెగూడెం, ధర్మపురి మండలం జైనలో 41.4, రాయికల్ మండలం అల్లీపూర్, సారంగపూర్‌లో 41.2, కోరుట్ల మండలం అయిలాపూర్‌లో 41.0, కథలాపూర్‌లో 40.7, ఎండపెల్లి మండలం మారెడుపల్లిలో 40.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

మేడిపల్లి, ధర్మపురి మండలం నేరెల్లలో 40.4, మల్యాల మండలం మద్దుట్ల, బుగ్గారం మండలం సిరికొండలో40.3, కోరుట్లలో 40.2, ధర్మపురి మండలం బుద్దేశ్‌పల్లి, జగిత్యాలలో 40.1 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు కాగా అత్యల్పంగా భీమారం మండలం 37.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి.

ఉగాది పురస్కారం అందుకున్న అంజన్న స్థానాచార్యులు



ఉగాది పురస్కారం అందుకుంటున్న కపీందర్

మల్యాల, మార్చి 30(ఆంధ్రజ్యోతి): ఉగాది సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ఆలయాల అర్చకులకు అందజేసే ఉగాది పురస్కారంను కొండగట్టు అంజనేయస్వామి దేవస్థానం స్థానాచార్యులు తిరుకోవెల కపీందర్ అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజారామయ్యర్, కమిషనర్ శ్రీధర్ చేతుల మీదుగా పురస్కారం స్వీకరించారు.

అనంతరం శేషవస్త్రాలతో పండిత సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో శ్రీకాంత్‌రావు, ప్రధానర్చకులు రామకృష్ణ, జితేంద్రప్రసాద్, రఘు, అర్చకులు, ఆలయ అధికారులు, సిబ్బంది కపీంధర్‌ను అభినందించారు.

ఘనంగా మల్లన్న బోనాలు



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

రాయికల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని మైతాపూర్ గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో మల్లన్న బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఒగ్గు కళాకారుల నృత్యాలతో గ్రామంలోని పురవీధుల గుండా బోనాలను ఎత్తుకుని ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం మల్లన్న స్వామికి బోనాలు సమర్పించారు.

పద్మశాలి సంఘం కార్యవర్గం

గొల్లపల్లి, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెన్గుమట్ల పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం ఆదివారం ఏర్పాటయింది. అధ్యక్షులుగా పెద్దూరు సత్తయ్య, ఉపాధ్యక్షుడుగా గౌరీ లక్ష్మీపతి, ప్రధాన కార్యదర్శిగా దోమల ఆనంద్, కోశాధికారిగా దోమల గంగాదర్, కార్యదర్శిగా మార్త లవన్ కుమార్ ఎన్నికయ్యారు. తమ పై నమ్మకం ఉంచి ఎన్నుకున్న సంఘం సభ్యులకు నూతన కార్యవర్గం ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ సంఘం అభివృద్ధికి, సంఘం బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని ఈ సందర్భంగా నూతన కార్యవర్గం పేర్కోంది.

ఘనంగా మల్లన్న పట్నాలు



ఆలయంలో పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

రాయికల్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మైతాపూర్ గ్రామంలో గల మల్లన్న దేవాలయంలో ఆదివారం మల్లన్న పట్నాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో మాజీ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజరెడ్డి, కొయ్యడి మహిపాల్, మహేందర్, జగదీష్, మండ రమేష్ తదితరులు ఉన్నారు.

పట్టాలిచ్చారు... భూముల హద్దులు మరిచారు

● ఇరవై ఏళ్ళుగా తప్పని నిరీక్షణ

● ఇబ్బందులు పడుతున్న లబ్ధిదారులు

కథలాపూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): భూమిని సాగు చేసుకుంటామనే గంపెడాశలతో రెండు దశాబ్దాలుగా నిరీక్షిస్తున్నా నేటికీ ఆ లబ్ధిదారులకు న్యాయం జరగడం లేదు. భూమికి సంబంధించిన పట్టాలు ఇచ్చారే తప్ప భూమి సరిహద్దులు చూపకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. 2008లో అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి భూమిలేని నిరుపేద మహిళలకు భూములు ఇవ్వాలని నిర్ణయించి భూపంపిణీలో పట్టాదారు పాసుపుస్తకాలు అందజేశారు. మహిళలకు ఆసరాగా ఉంటుందనే భావనతో పథకం ప్రవేశపెట్టినా క్షేత్రస్థాయిలో మాత్రం భూములు కేటాయించలేదు.

● పట్టా ఉన్నా ఫలితం శూన్యం

మండలంలోని దుంపెట, అంబారిపేట, తుర్తి, కలికోట, భూషణరావుపేట, దూలూరు, సిరికొండ, ఇప్పపల్లి గ్రామాల్లో 30 మందికి 33 ఎకరాల మేర భూమిని కేటాయిస్తూ లబ్దిదారులకు పట్టాదారు పాసుపుస్తకాలు అందించారు. అయితే రెవెన్యూ అధికారులు సూచించిన సర్వే నంబర్లలో భూమి లేకపోవడంతో అయోమయంకు గురయ్యారు. తమకు భూమి చూపించాలని రెవెన్యూ అధికారుల వద్దకు కాళ్ళరిగేలా తిరిగినా కనికరించలేదు. సిరికొండ, కలికోట, తుర్తి, భూషణరావుపేట గ్రామాల్లో భూములు పొందిన వారు ఆ ప్రాంతాలకు వెళ్తే సాగులో ఉన్న రైతులతో గొడవలు జరిగాయి. ప్రస్తుతం భూముల విలువలు పెరిగిపోయిన నేపథ్యంలో తమకు భూములు చూపించాలని లబ్దిదారులు కోరుతున్నారు.

● ఎన్ని వినతులు ఇచ్చినా భూమి చూపించలేదు

దూలూరు లత, సిరికొండ



వ్యవసాయ కూలీగా ఉన్న నాకు 2008లో సిరికొండలో 205/అ1 నద్దినాలలో రెండు ఎకరాల భూమి కేటాయిస్తున్నట్టు అధికారులు పట్టా పుస్తకం అందజేశారు. కలెక్టర్‌కు పరిస్థితి విన్నవించుకున్నా. సర్వే చేసి భూమి ఇవ్వాలని ఆదేశించినా నేటికీ భూమి చూపించలేదు. మానవ హక్కుల కమీషన్‌లో ఫిర్యాదు చేయగా సత్వరమే భూమి చూపించాలని సూచించినా ఫలితం లేకుండా పోయింది. ఈ ప్రభుత్వమైనా భూమి చూపించి ఆదుకోవాలి.

రైతు వేదికల్లో సమస్యల తిష్ఠ

●అటెండర్లు లేక అస్తవ్యస్తం ●నిర్వహణ ఖర్చులు రెండేళ్లుగా విడుదల కాని వైనం

కథలాపూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) రైతులకు వ్యవసాయ పంటల సాగుపై ఎప్పటికప్పుడు వస్తున్న అధునాతన విధానాలపై రైతులు అవగాహన పెంచడానికి ఏర్పాటు చేసిన రైతు వేదికల్లో సమస్యలు తిష్ట వేశాయి. రైతులు వివిధ రకాల సమస్యలపై అధికారుల వద్దకు వస్తే ఎవరూ అందుబాటులో ఉండడం లేదని అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కో రైతు వేదికకు రూ.20 లక్షల నిధులు వెచ్చించి నిర్మించినప్పటికీ కొన్ని నిరుపయోగంగానే ఉంటున్నాయి. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో రైతులకు కావలసిన సేవలు సకాలంలో అందడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

● అటెండర్ల నియామకంలో నిర్లక్ష్యం

ప్రభుత్వం రైతుభరోసా, రైతు బీమా, రుణమాఫీ, నూతన పంటల సాగులో మెళకువల కోసం రైతునేస్తం వంటి కార్యక్రమాలు కొనసాగిస్తోంది. మండలంలో గంభీర్‌పూర్, అంబారిపేట, బొమ్మెన, భూషణరావుపేట, కథలాపూర్ క్లస్టర్లలో రైతు వేదికలు నిర్మించారు. ఆయా పథకాలకు సంబంధించిన సమస్యలు చెప్పుకునేందుకు రైతువేదికలకు వస్తున్న రైతులకు కనీసం తాగునీరు కూడా అందుబాటు ఉండడం లేదు. అటెండర్లను నియమించకపోవడంతో దుమ్ము పట్టిపోతున్నాయి. ఒక్కో క్లస్టర్ పరిధిలో నాలుగు గ్రామాలు ఉండగా ప్రతీ దినం ఏఈవోలు పంటలు పర్యవేక్షించడానికి తిరుగుతుంటారు. ఏఈఓలు వచ్చే దాకా రైతు వేదికలు మూసి ఉంచాల్సి వస్తోంది. గతంలో వీఆర్‌ఏలను ఇతర శాఖల్లోకి మార్చే సమయంలో రైతు వేదికలకు వారిని నియమించాలని వ్యవసాయ శాఖ ప్రతిపాదన చేసినా అమలుకు నోచుకోలేదు. దీంతో అటెండర్ల నియామకానికి బ్రేక్ పడింది. నిర్వహణ కోసం రెండు సంవత్సరాల కింద అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం ఆరు మాసాల డబ్బులు విడుదల చేయగా నేటికీ మళ్లీ డబ్బులు రాలేదని ఏఈవోలు పేర్కొంటున్నారు. కాగా రైతువేదికల చుట్టూ ప్రహరీ లేకపోవడంతో మూగజీవాలు తిష్ట వేస్తున్నాయి. రైతు వేదికలకు అటెండర్లను నియమించడంతో పాటు ప్రతీ నెలా నిర్వహణ కోసం నిధులు కేటాయించాలని రైతులు, ఏఈవోలు కోరుతున్నారు.



బొమ్మెన రైతువేదిక

ఘనంగా పాఠశాల వార్షికోత్సవం



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

కథలాపూర్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పోతారం పీఎంశ్రీ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం వార్షికోత్సవ, స్పోర్ట్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు వివిధ పాటలపై ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. ప్రైవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని సెక్టోరల్ అధికారులు కె. సత్యనారాయణ, రాజేశం పేర్కొన్నారు. ఇంద్రాల రాములు అనే వ్యక్తి పాఠశాల అభివృద్ధి కోసం రూ.50 వేలు విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, సీఆర్‌పీలు అజయ్, కృష్ణప్రసాద్, మాజీ ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

శిశుమందిర్‌లో గ్రాడ్యుయేషన్ డే



సర్టిఫికెట్లతో విద్యార్థులు

కోరుట్ల, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈసందర్భంగా క్రమశిక్షణకు మారుపేగా శ్రీ సరస్వతి శిశుమందిర్ విద్యా సంస్థలు నిలుస్తాయని జిల్లా కెమిస్ట్రీ ఉపన్యాసకురాలు నీలి వాసవి అన్నారు. పట్టణం లోని శ్రీ సరస్వతి శిశుమందిర్‌లో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమ నిర్వహించి యుకేసీ విద్యార్థులకు 1వ తరగతిలో చేరడానికి ప్రమోషన్ కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులకు సర్టిఫికేట్లను అందించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్యాలు ఆహ్వానితులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా నీలి వాసవి మాట్లాడారు. సంస్కృతి సంప్రదాయాలకు మారుపేరుగా శిశుమందిర్ విద్యా సంస్థలు నిలుస్తాయని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ వనపర్తి చంద్రమోహన్, చెట్‌పల్లి శంకర్, పిస్క రమేష్, అందె శివ ప్రసాద్, ఎలిమిల్ల మనోజ్ కుమార్, కొత్త సందీప్, ప్రధానోపాధ్యాయుడు గోపు వెంకటేష్‌లతో పాటు అచార్య బృందం పాల్గొన్నారు.

మత సామరస్యాన్ని పాటించాలి

ఎమ్మెల్యే సంజయ్ కుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజయ్

జగిత్యాల అర్బన్, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని తారక రామానగర్‌లో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పాల్గొని ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల, మత బేధం లేకుండా అందరూ కలిసి ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్సై సుధాకర్, మాజీ కౌన్సిలర్ చాంద్ పాషా, సదర్‌లు కుదరత్, షబ్బీర్, సుధాకర్, శరత్ రావు తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి

వేములవాడ, మార్చి 30 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తం గా కుల గణన చేపట్టాలని వేములవాడ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఏప్రిల్ రెండో తేదీన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించనున్న బీసీల పోరుగర్జన పోస్టర్‌ను ఆదివారం ఆయన వేములవాడలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ బీసీల సంక్షేమం కోసం కామారెడ్డి డిక్లరేషన్‌లో ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో కులగణన నిర్వహించి బీసీల రిజర్వేషన్ల పెంపుపై ముందడుగు వేశా రని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మ కంగా నిర్వహించిన కులగణన ద్వారా బీసీల జనాభా 56.37 శాతం ఉందని లెక్క తేలిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం బీసీల లెక్క తేల్చడానికి సిద్ధంగా లేదని అన్నారు. కేంద్ర ప్ర భుత్వానికి చిత్తశుద్ధి ఉంటే బీసీల చట్టాన్ని పార్లమెంట్‌లో ఆమోదింపచేసి తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 2న ఢిల్లీలో జరిగే బీసీల పోరు గర్జనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సంఘం, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.